


## జ్యోతికి ఆర్థిక సాయం

ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ యువ అథ్లెట్, గతేడాది హాంగ్జౌ (చైనా) వేదికగా ముగిసిన వంద మీటర్ల హర్డిల్స్ విభాగంలో రజత పతకం గెలిచిన జ్యోతి యర్రాజీ విదేశీ శిక్షణకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆర్థిక సాయం చేయనుంది. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఆమె స్పెయిన్‌లోని టెనెరైఫ్‌లో 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందేందుకు గాను సాయాన్ని కోరింది. క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని టార్గెట్ ఒలింపిక్ పోడియమ్ స్కీమ్ (టాప్స్) నిధుల నుంచి జ్యోతికి విమాన ఖర్చులు, వీసా అప్లికేషన్ ఫీజులతో ఇతరత్రా ఖర్చులను టాప్స్ భరించనుంది. ఈ మేరకు మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) ఆర్థిక సాయానికి ఆమోదం తెలిపింది.

## వాళ్లకు మసాలా దొరకలేదనే..!

- గంభీర్‌కు హగ్ ఇవ్వడంపై కోహ్లీ స్పందన



న్యూఢిల్లీ: ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇటీవల బెంగళూరు వేదికగా కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ మెంటార్ గంభీర్‌ను హత్తుకోవడంపై వస్తున్న వాదనలపై రన్ మెషీన్ స్పందించాడు. గంభీర్–కోహ్లీ హగ్‌పై గవాస్కర్ వంటి క్రికెట్ విశ్లేషకులు.. 'వాళ్లిద్దరికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు' అని కామెంట్ చేయగా సోషల్ మీడియాలోనూ దీనిపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కోహ్లీ మాట్లాడుతూ... 'కొంత మంది నా వ్యవహార శైలి చూసి నిరాశపడ్డారు. నేను ఆరోజు నవీన్, గౌతీ భాయ్ (గంభీర్)ను హగ్ చేసుకున్నాను. పలువురు మసాలాను మిస్ అయ్యారు' అంటూ పరోక్షంగా చురకలంటించాడు.

## విష్ణు స్థానంలో హార్విక్

ముంబై : ముంబై ఇండియన్స్ బ్యాటర్ విష్ణు వినోద్ ముంజేయి గాయం కారణంగా అతడు ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. విష్ణు స్థానంలో సౌరాష్ట్ర వికెట్ కీపర్ హార్విక్ దేశాయ్‌ను జట్టులోకి తీసుకున్నట్టు ముంబై ఇండియన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఐదు వికెట్లతో బుమ్రా విజృంభణ



బుమ్రా (5/21)

వాంఖడేలో ముంబై గర్జన

# 93 బంతుల్లో 199

### ఇషాన్, సూర్య సుడిగాలి ఇన్నింగ్స్ • బెంగళూరుకు ఐదో పరాభవం

120 బంతుల్లో 197. టీ20లలో ఇదేం కాపాడుకోలేనంత తక్కువ లక్ష్యమేమి కాదు. కానీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలర్ల పుణ్యమా అని ఈ భారీ ఛేదనను ముంబై ఇండియన్స్ 93 బంతుల్లోనే ఊదేసింది. క్రీజులోకి వచ్చిన బ్యాటర్ కొడితే సిక్స్ లేకుంటే ఫోర్ అన్న రేంజ్‌లో విధ్వంసరచన చేస్తూ అరేబియా సముద్రపు తీరాన పరుగుల వరద పారించారు. బెంగళూరు బౌలింగ్ యూనిట్‌ను నెట్ బౌలర్లుగా మారుస్తూ ఇషాన్, సూర్య కొట్టిన కొట్టుడుకు అంత భారీ లక్ష్యం ఏమాత్రమూ సరిపోలేదు. బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగగా డుప్లెసిస్, పాటిదార్, కార్తీక్ మెరుపులతో ఆర్సీబీ భారీ స్కోరు చేసినా ఆ జట్టు మరోమారు ఓటమి వైపే నిలిచింది. ఈ సీజన్‌లో ముంబైకి ఇది రెండో గెలుపు కాగా ఆర్సీబీకి ఐదో ఓటమి.

**బుమ్రా మాయ..** 16 ఓవర్లకు 149–4తో పటిష్టంగా కనిపించిన బెంగళూరుకు బుమ్రా వరుస ఓవర్లలో షాకులిచ్చాడు. 17వ ఓవర్లో డుప్లెసిస్‌తో పాటు మహిపాల్ లోమ్రర్(0)ను ఔట్ చేసిన అతడు.. 19వ ఓవర్లో సౌరవ్ చౌహాన్ (9), విజయ్‌కుమార్ (0)ను పెవిలియన్ చేర్చాడు.

ముంబై: ఐపీఎల్–17లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత ఢిల్లీ మ్యాచ్‌తో విజయాల బాట పట్టిన ముంబై ఇండియన్స్ సొంత ఇలాఖా వాంఖడేలో మరోసారి విజయగర్జన చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 197 పరుగుల లక్ష్యాన్ని మరో 27 బంతులు మిగిలుండగానే 'ఉఫ్'మని ఊదేసింది. బౌలింగ్‌లో స్పీడ్‌గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల (5/21)తో చెలరేగితే బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69, 7 ఫోర్లు, 5 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 52, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), రోహిత్ శర్మ (24 బంతుల్లో 38, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) చితక్కొట్టడంతో ముంబై 15.3 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. కెప్టెన్ డుప్లెసిస్ (40 బంతుల్లో 61, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 53 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), రజత్ పాటిదార్ (26 బంతుల్లో 50, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. బుమ్రా కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**నిలబెట్టిన పాటిదార్, డుప్లెసిస్**

ఆర్సీబీ ఇన్నింగ్స్ ఒడిదొడుకులతోనే మొదలైంది. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లీ (3)ని బుమ్రా మూడో ఓవర్లోనే ఔట్ చేయడంతో బెంగళూరు తొలి వికెట్ కోల్పోయింది. తొలి మ్యాచ్ ఆడుతున్న విల్ జాక్స్ (8) రెండు ఫోర్లు కొట్టినా ఆకాశ్ మధ్వాల్ 4వ ఓవర్లో టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 23 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని డుప్లెసిస్, పాటిదార్ నిలబెట్టారు. ఈ ఇద్దరూ వికెట్ కాపాడుకుంటూనే వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించారు. గెరాల్డ్ కొయెట్జ్ వేసిన 12వ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టిన పాటిదార్.. 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కోహ్లీ కాకుండా ఈ సీజన్‌లో ఆర్సీబీ తరఫున తొలి ఫిఫ్టీ చేసిన బ్యాటర్ అతడే. కానీ ఆ ఓవర్లో మరుసటి బంతికే పాటిదార్.. ఇషాన్‌కు క్యాచ్ ఇవ్వడంతో 82 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రజత్ స్థానంలో వచ్చిన మ్యాక్స్‌వెల్ మరోసారి సున్నా చుట్టాడు. ఆఖర్లో కార్తీక్ దుమ్మురేపాడు. ముంబై బౌలర్లను ఉతికి ఆరేస్తూ కార్తీక్ 22 బంతుల్లోనే 50 పూర్తి చేయడంతో ఆర్సీబీకి భారీ స్కోరు దక్కింది.

**ఇషాన్, హిట్‌మ్యాన్ ధనాధన్..**

భారీ లక్ష్య ఛేదనలో ముంబై ఆదినుంచే విరుచుకుపడింది. అంతంతమాత్రంగానే ఉన్న ఆర్సీబీ బౌలర్లపై ఇషాన్, రోహిత్ తుఫానులా ముంచెత్తారు. ముఖ్యంగా ఇషాన్ అయితే కొడితే సిక్స్ లేదంటే ఫోర్ అన్న రేంజ్‌లో చెలరేగాడు. 9 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తిచేసిన ఈ జోడీని ఎట్టకేలకు ఆకాశ్ దీప్ విడదీశారు.

### 'సూర్య' ప్రతాపం..

ఇషాన్ నిష్క్రమించినా వన్ డౌన్‌లో వచ్చిన సూర్యకుమార్ యాదవ్.. బ్యాట్‌లో స్ప్రింగులు పెట్టుకుని వచ్చాడా అన్న అనుమానం కలిగేలా బాదేశాడు. 15 పరుగుల వద్ద అతడిచ్చిన క్యాచ్‌ను డీప్‌లో మ్యాక్స్‌వెల్ జారవిడవడంతో సూర్య ఆ అవకాశాన్ని రెండుచేతులా అందుకున్నాడు. రోహిత్ ఔట్ అయినా హార్దిక్ పాండ్యా (6 బంతుల్లో 21 నాటౌట్, 3 సిక్సర్లు) అండతో దుమ్మురేపాడు. 17 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తైంది. ఐపీఎల్‌లో సూర్యకు ఇది వేగవంతమైన అర్ధసెంచరీ కావడం విశేషం. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో సూర్య సృష్టించిన విధ్వంసానికి స్టేడియం హోరెత్తిపోయింది. మిస్టర్ '360' అన్న ట్యాగ్‌లైన్‌కు తగ్గట్లు సూర్య కొట్టిన షాట్లకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. 13వ ఓవర్లో సూర్య పెవిలియన్ చేరినా తిలక్ వర్మ (10 బంతుల్లో 16 నాటౌట్, 3 ఫోర్లు) తో కలిసి పాండ్యా విజయ లాంఛనాన్ని పూర్తిచేశాడు.



సూర్య (52)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 5 | 4 | 1 | 0.87 | 8 |
| కోల్‌కతా | 4 | 3 | 1 | 1.52 | 6 |
| లక్నో | 4 | 3 | 1 | 0.77 | 6 |
| చెన్నై | 5 | 3 | 2 | +0.66 | 6 |
| హైదరాబాద్ | 5 | 3 | 2 | +0.34 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | -0.63 | 6 |
| ముంబై | 5 | 2 | 3 | -0.07 | 4 |
| పంజాబ్ | 5 | 2 | 3 | -0.19 | 4 |
| బెంగళూరు | 6 | 1 | 5 | -1.12 | 2 |
| ఢిల్లీ | 5 | 1 | 4 | -1.37 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

**సంక్షిప్త స్కోర్లు**

బెంగళూరు: 20 ఓవర్లలో 196/8 (డుప్లెసిస్ 61, కార్తీక్ 53 నాటౌట్, బుమ్రా 5/21, గోపాల్ 1/32) ముంబై : 15.3 ఓవర్లలో 199/3 (ఇషాన్ 69, సూర్య 52, జాక్స్ 1/24, వైశాక్ 1/32)

## పోరాడి ఓడిన నాగల్



మాంటెకార్లో: ప్రతిష్టాత్మక ఏటీపీ మాంటె కార్లో మాస్టర్స్‌లో భారత టెన్నిస్ సంచలనం సుమిత్ నాగల్ రెండో రౌండ్‌లో పోరాడి ఓడాడు. బుధవారం వర్షం కారణంగా గురువారానికి వాయిదా పడ్డ మ్యాచ్‌లో నాగల్ 3–6, 6–3, 2–6 తేడాతో ఏడో సీడ్ హోల్గర్ రూన్ చేతిలో ఓడిపోయాడు. బుధవారం నాటి ఆటలో ఒక సెట్ కోల్పోయినా నాగల్ అద్భుతంగా పుంజుకుని రెండో సెట్ గెలుచుకున్నాడు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో రెండు సార్లు తన సర్వీస్‌ను కోల్పోవడంతో నాగల్‌కు పరాభవం తప్పలేదు. ఈ టోర్నీలో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ 7–5, 6–3 తేడాతో అన్‌సీడెడ్ లొరెంజో ముసెట్టిపై అలవోక విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మరో అగ్రశ్రేణి ఆటగాడు డానియల్ మెద్వెదెవ్ 3–6, 7–5 తేడాతో రష్యాకే చెందిన 15వ సీడ్ కరెన్ ఖచనోవ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఐదో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 5–7, 6–7 (3/7) తేడాతో గ్రీక్ ఆటగాడు సిట్సిపస్ చేతిలో చిత్తయ్యాడు.

## ఖేల్ ఖతమ్

బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్




నింగ్‌బో: ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత పోరాటం రెండో రౌండ్‌కే ముగిసింది. భారీ ఆశలతో ఈ టోర్నీ బరిలో నిలిచిన 15 మంది భారత షట్లర్లు రెండో రౌండ్ కూడా దాటలేక చతికిలపడ్డారు. అగ్రశ్రేణి ఆటగాళ్లంతా విఫలమైనా తొలి రౌండ్‌లో హోరాహోరీగా పోరాడి రెండో రౌండ్ చేరిన పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్‌లో సింధు 18–21, 21–13, 17–21 తేడాతో ఆరోసీడ్ హన్ యూయి చేతిలో చిత్తైంది. తొలి సెట్‌లో ప్రత్యర్థికి గట్టిపోటీనిచ్చినా సింధుకి నిరాశ తప్పలేదు. రెండో సెట్‌లో పుంజుకున్నా నిర్ణయాత్మక మూడో సెట్‌లో చైనా అమ్మాయి దూకుడు పెంచడంతో సింధు కథ ముగిసింది. హన్ యూయితో ఆడిన ఆరు మ్యాచ్‌లలో సింధుకు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఏడో సీడ్ ప్రణయ్.. 18–21, 11–21 తేడాతో అన్‌సీడెడ్ తైవాన్ ఆటగాడు చున్ యి లిన్ చేతిలో పరాభవం పాలయ్యాడు. 43 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో ప్రణయ్ ప్రత్యర్థికి కనీస పోటీ ఇవ్వలేకపోయాడు. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం తనీషా క్రాస్టో– అశ్విని పొన్నప్ప 17–21, 12–21 తేడాతో జపాన్ జోడీ నమి మత్సుయమ – చిహారు చేతిలో ఓడింది.

## సంజూకు జరిమానా



జైపూర్: నిర్దేశిత సమయంలో ఓవర్ల కోటాను పూర్తి చేయనందుకు గాను రాజస్థాన్ రాయల్స్ సారథి సంజూ శాంసన్‌కు జరిమానా పడింది. బుధవారం జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ కేటాయించిన సమయంలో 20 ఓవర్ల కోటాను పూర్తిచేయకపోవడంతో శాంసన్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించినట్టు ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. రెండోసారి ఇదే తప్పు పునరావృతమైతే కెప్టెన్‌కు రూ. 24 లక్షలు, జట్టులోకి ఇతర ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పడుతుంది.

## ఆధిక్యంలో గుకేశ్



టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. గురువారం జరిగిన పురుషుల ఆరో రౌండ్ పోరులో గుకేశ్..హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఇయాన్ నెపోమియాచీ(4)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. మిగతా గేముల్లో విదిత్ గుజరాతీ..ఫిరౌజ అలీరెజాపై గెలువగా, ప్రజ్ఞానంద..నిజాత్ అబసోవ్‌ను ఓడించిచాడు. మరోవైపు మహిళల కేటగిరీలో వైశాలి..క్యాతరీనా లాగ్నో చేతిలో ఓడగా, కొనేరు హంపిపై తింగ్జి లీ గెలిచి ముందంజ వేసింది.



## బీవోబీ వడ్డీరేట్ల పెంపు

5 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 5 బేసిస్ పాయింట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. నాలుగు నెలల తర్వాత మళ్లీ వడ్డీరేట్లను పెంచడం ఇదే తొలిసారి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు రుణాలపై వడ్డీరేటు 8.05 శాతం నుంచి 8.10 శాతానికి చేరుకుంది. అలాగే మూడు, ఆరు, ఏడాది కాలపరిమితి రుణాలపై రేట్లను కూడా ఇంతే స్థాయిలో సవరించింది. దీంతో మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 8.45 శాతానికి చేరుకోగా, ఆరు నెలల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.65 శాతానికి, ఏడాది రుణాలపై రేటు 8.85 శాతానికి సవరించింది. ఈ నూతన వడ్డీరేట్లు శుక్రవారం నుంచి అమలులోకి రానున్నట్లు బ్యాంక్ ప్రతినిధి ఒకరు తెలిపారు. మరోవైపు, దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..రెపోతో అనుసంధానమైన గృహ రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్ల నుంచి 15 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 9.05 శాతం నుంచి 9.8 శాతం మధ్యలోకి చేరుకున్నాయి.

## ఐటీకి తప్పని నిరాశ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:దేశీయ ఐటీ సంస్థలకు మళ్లీ నిరాశతప్పేటట్టు కనిపించడం లేదు. అంతర్జాతీయ దేశాల ఆర్థిక స్థితిగతులు అనిశ్చితిలో కొనసాగుతుండటం, టెక్నాలజీ డిమాండ్ పడిపోవడం, క్లయింట్లు తమ ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రాధాన్యతనివ్వడంతో ఐటీ సంస్థలు నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో బలహీనమైన వృద్ధిని నమోదు చేసుకోనున్న ఐటీ కంపెనీలు..ద్వితీయార్థంలో మాత్రం తిరిగి పుంజుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నాయి. దేశీయ సంస్థలతోపాటు అంతర్జాతీయ సంస్థలైన యాక్సెంచర్, కాగ్నిజెంట్ టెక్నాలజీ, క్యాప్ జెమినీలు సైతం తొలి ఆరు నెలల్లో మందకొడి వృద్ధిని నమోదు చేసుకోనుండగా..ద్వితీయార్థంలో రికవరీ బాట పట్టనున్నాయి. కానీ, మోతీలాల్ ఓశ్వాల్ మాత్రం..డిసెంబర్ త్రైమాసికం కంటే గత త్రైమాసికంలో మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఉన్నదని పేర్కొంది. అనిశ్చిత ఆర్థిక పరిస్థితులు కొనసాగుతుండటంతో ఐటీ రంగంపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని వెల్లడించింది. 2008–09లో ఐటీ రంగ వార్షిక వృద్ధి 4.9 శాతానికి పరిమితమైందని, ఇప్పటి వరకు ఇదే కనిష్ఠ స్థాయని మోతీలాల్ తన నివేదికలో వెల్లడించింది. కీలక రంగాలు బలహీనంగా ఉండటంతోపాటు బ్యాంకింగ్, ఆర్థిక, సేవలు, బీమా రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితులతో అంతర్జాతీయ సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపింది.

- ఈ నెల 12న దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ తన నాలుగో త్రైమాసికం, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తున్నది.
- ఈ నెల 18న ఇన్ఫోసిస్, 19న విప్రో, 25న టెక్ మహీంద్రాలు తమ ఆర్థిక ఫలితాలు ప్రకటించబోతున్నాయి.

## బెంజ్ రికార్డు అమ్మకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్..రికార్డు స్థాయి అమ్మకాలు జరిపింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 18,123 యూనిట్లను విక్రయించింది. దేశీయంగా ఎస్‌యూవీలకు పెరిగిన డిమాండ్‌తో అంతక్రితం ఏడాది విక్రయించిన వాహనాలతో పోలిస్తే 10 శాతం పెరిగాయని మెర్సిడెజ్–బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ తెలిపారు. కేవలం జనవరి–మార్చి మధ్యకాలంలోనే సంస్థ 5,412 యూనిట్లను విక్రయించింది. ఈ ఏడాది దేశీయ మార్కెట్లోకి మూడు ఈవీలతోపాటు మొత్తంగా తొమ్మిది వాహనాలను విడుదల చేయాలనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే రెండు లగ్జరీ మార్ 20ఎక్స్ అవుట్‌లెట్లను న్యూఢిల్లీ, ముంబైలలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు.



### వాణిజ్యం



కార్పొరేట్ ఎడిషన్‌గా

## గ్రాండ్ ఐ10

**ధర రూ.6.93 లక్షలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశీయ మార్కెట్‌కు కార్పొరేట్ ఎడిషన్‌గా గ్రాండ్ ఐ10 మాడల్‌ను పరిచయం చేసింది హ్యుందాయ్ మోటర్. పాత మాడల్‌తో పోలిస్తే నయా మాడల్‌ను లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రెండు రకాల్లో లభించనున్న ఈ మాడళ్లలో 1.21 కప్పా పెట్రోల్ 5 ఎంటీ వెర్షన్ రూ.6,93,200గాను, స్మార్ట్ ఆటో ఆటోమేటిక్ వెర్షన్ ధర రూ. 7,57,900గా నిర్ణయించింది. భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా టైర్–ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, సీట్–బెల్ట్ రిమైండర్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, సెంట్రల్ డోర్ లాకింగ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ..దేశీయ యువతను లక్ష్యంగా చేసుకొని ఈ కార్పొరేట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, ఇప్పటికే నాలుగు లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయన్నారు.





మరో 14 విమానాశ్రయాల్లో

## డిజీ యాత్ర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఈ నెల చివరినాటికి మరో 14 విమానాశ్రయాల్లో డిజీ యాత్ర అమలులోకి రానున్నది. విమానాశ్రయాల్లో ఎలాంటి చెకింగ్ లేకుండానే నేరుగా విమానం ఎక్కేందుకు వీలుగా ఈ డిజీ యాత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ యాప్‌ను 50 లక్షల మంది వినియోగిస్తున్నారు. ఈ చివరినాటి నుంచి విశాఖపట్నంతోపాటు త్రివేండ్రం, శ్రీనగర్, రాంచి, రాయ్‌పూర్, పాట్నా, మంగళూరు, ఇండోర్, కోయంబత్తూరు, చెన్నై, భువనేశ్వర్ విమానాశ్రయల్లో అందుబాటులోకి రానున్నది.

# ఈపీఎఫ్‌వో వేతన పరిమితి పెంపు?





న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) వేతన పరిమితిని కేంద్ర ప్రభుత్వం పెంచాలని చూస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం రూ.15,000గా ఉన్న ఈ సీలింగ్‌ను రూ.21,000కు తీసుకెళ్లాలని కేంద్రం యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే లోక్‌సభ ఎన్నికల నడుమ ఈ ప్రతిపాదన ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఉద్యోగుల ఓటు బ్యాంకును ఆకట్టుకోవడంలో భాగంగానే మోదీ సర్కారు ఈ దిశగా ఆలోచిస్తున్నదన్న విమర్శలైతే వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఈపీఎఫ్‌వోలో సభ్యత్వం ఉన్న ఉద్యోగులు ఎప్పట్నుంచో వేతన పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎప్పుడూ పట్టించుకోని ప్రభుత్వం.. ఇప్పుడు దాన్ని తెరపైకి తీసుకురావడం వెనుక ఎన్నికల ప్రయోజనమే ఉందన్న అభిప్రాయాలు గట్టిగా వస్తున్నాయి. ఉద్యోగుల సామాజిక భద్రతని పైకి సర్కారు చెప్తున్నా.. అంతా వట్టిదేనని అంటున్నారు.

**చివరిసారి 2014లో..**

2014లో చివరిసారిగా పీఎఫ్ సాలరీ లిమిట్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. రూ.6,500ల నుంచి రూ.15,000కు మార్చింది. ఇక 1952లో ఈ పథకం మొదలైంది. అప్పట్నుంచి ఇప్పటిదాకా మొత్తం 8సార్లు పెంచారు. 1952లో రూ.300గా ఉన్నది. అయితే దీన్ని 1957లో రూ.500కు, 1962లో రూ.1,000కి, 1976లో రూ. 1,600కు, 1985లో రూ.2,500కు, 1990లో రూ.3,500కు, 1994లో రూ.5,000కు, 2001లో రూ.6,500కు, 2014లో రూ.15,000కు సవరించారు.

**పరిమితి పెరిగితే..!**

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి పెరిగితే కంపెనీల యాజమాన్యాలపై భారం పడినా.. ఉద్యోగులకు మాత్రం లాభమే జరుగుతుంది. ఉద్యోగి బేసిక్ సాలరీ, డీఏ ఆధారంగా ప్రావిడెంట్ ఫండ్‌కు నగదు మొత్తాలు నెలనెలా జమవుతాయన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఉద్యోగి జీతం నుంచి 12 శాతం, దీనికి సమానంగా యాజమాన్యం ద్వారా మరో 12 శాతం పీఎఫ్ ఖాతాకు వెళ్తుంది. దీనికి సంబంధించిన వేతన పరిమితే ప్రస్తుతం రూ.15,000గా ఉన్నది. దీన్నే రూ.21,000కు పెంచాలని చూస్తున్నారు. ఇదే పెరిగితే ఇప్పటిదాకా రూ.15,000 ప్రాతిపదికన పీఎఫ్ ఖాతాకు జమవుతున్న మొత్తాలు.. ఇకపై రూ.21,000 ప్రాతిపదికన జమవుతాయి. దీనివల్ల ఉద్యోగి రిటైర్మెంట్ ఫండ్‌కు నిధులు పెరుగుతాయి. పదవీ విరమణ సమయంలో మరింత ఎక్కువగా నగదును పొందవచ్చు. కాగా, ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు కంపెనీల ద్వారా వెళ్లే 12 శాతంలో 8.33 శాతం సొమ్ము సదరు ఉద్యోగి పెన్షన్ ఖాతాకు వెళ్తుంది. మిగతా 3.67 శాతం ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమవుతుంది. ఉద్యోగి నుంచి తీసుకునే మొత్తాలు మాత్రం పూర్తిగా ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలోకే వెళ్తాయి. అలాగే ప్రభుత్వం నుంచి కూడా 1.16 శాతం ఉద్యోగుల పెన్షన్ పథకంలోకి వచ్చి చేరుతుంది.

# కూల్ మార్కెట్‌కు కిక్కు

క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు • ఎఫ్‌ఎంసీజీ, డెయిరీ సంస్థల్లో ఆశలు

### ఐస్‌క్రీమ్, శీతల పానీయాల అమ్మకాలు పుంజుకుంటాయన్న అంచనాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నడుమ.. ఐస్‌క్రీమ్, శీతల పానీయాల సంస్థల్లో గిరాకీ అంచనాలు బలపడుతున్నాయి. ఎఫ్‌ఎంసీజీ, డెయిరీ ఉత్పత్తుల సంస్థలు ఈసారి ఎండాకాలంలో తమకు గిరాకీ బాగుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కోలా ఆధారిత ఫిజ్ డ్రింకులు, జ్యూస్‌లు, మినరల్ వాటర్, ఐస్ క్రీములు, పాల ఉత్పత్తులు ఈ సమ్మర్‌లో అధికంగా అమ్ముడుపోగలవని అంటున్నారు. ఈ క్రమంలోనే మార్కెట్‌లో కస్టమర్ల డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తిని పెంచి.. వ్యాపారులు, దుకాణదారుల వద్ద నిల్వలను పెంపొందించే పనిలో కంపెనీలు పడ్డాయి. ఈ ఏప్రిల్–జూన్ మధ్య ఎండల తీవ్రత బాగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించిన సంగతి విదితమే. దీంతో సేల్స్‌పై ఈసారి భారీ అంచనాలనే కంపెనీలు పెట్టుకున్నాయి.

**ప్రచారంపై దృష్టి**

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా కొత్తకొత్త ఉత్పత్తులనూ మార్కెట్‌కు పరిచయం చేసే దిశగా ఆయా సంస్థలు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రచారం పైనా దృష్టి పెడుతున్నాయి. ఇందులోభాగంగానే పత్రికలు, టెలివిజన్లు, యూట్యూబ్‌తో పాటు ఆన్‌లైన్ ఎడిషన్లు, సోషల్ మీడియాల్లో కూడా ప్రచారానికి తెర లేపుతున్నాయి. ఇప్పటికే దిగ్గజ సంస్థ పెప్సీ.. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్న, హృతిక్ రోషన్, మహేశ్ బాబు, కియారా అదానీ, నయనతారలతో కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. పెప్సీ, 7అప్, మిరిండా, మౌంటెయిన్ డ్యూ, స్లైస్, ట్రాపికానా తదితర ఉత్పత్తులను పెప్సీ అమ్ముతున్న విషయం తెలిసిందే. అలాగే కోకాకోలా, డాబర్, హాప్ తదితర ఇతర సంస్థలూ జోరును పెంచాయి. థమ్సప్, మాజా, స్ప్రైట్, ఫాంటా, కిన్లే సోడా వంటి కూల్‌డ్రింక్స్‌ను కోకాకోలా విక్రయిస్తున్నది. నిజానికి ఏడాదిలో సమ్మర్ మినహా మిగతా రోజుల్లో కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల ఉత్పత్తి, ప్రచారం, అమ్మకాలు తక్కువగానే ఉంటాయి. అయితే ఫిబ్రవరి మొదలు జూన్ దాకా వీటి సందడి ఉంటుంది.



హైదరాబాద్‌లో

## ది టేస్ట్ ప్లాంట్

హైదరాబాద్, ఏప్రిల్ 11: రెడీ–టూ–ఈట్ ఫుడ్ రంగంలో ఉన్న హైదరాబాదీ సంస్థ 'ది టేస్ట్ కంపెనీ'..అంతర్జాతీయ దేశాల్లో అడుగుపెట్టింది. వ్యాపార విస్తరణలో భాగంగా యూఏఈలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, భవిష్యత్తులో బ్రిటన్, అమెరికా, సింగపూర్ దేశాల్లో విడుదల చేయనున్నట్లు కంపెనీ కో–ఫౌండర్, సీఈవో అనిల్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఐదు రకాల అల్పాహారాలతోపాటు ఏడు రకాల వెజ్ మీల్స్, ఆరు రకాల నాన్–వెజ్ మీల్స్‌లను కలుపుకొని మొత్తంగా 18 రకాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, హైదరాబాద్‌కు సమీపంలో రూ.34 కోట్ల పెట్టుబడితోఅడ్వాన్స్‌డ్ డీహైడ్రేషన్, ఫ్రీజ్ డ్రైయింగ్ టెక్నాలజీతో ప్లాంట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. నెలకు 30 లక్షల బాక్స్‌లను తయారు చేయగల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్లో 120 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కంపెనీ ఉత్పత్తులు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఇతర ఈ–కామర్స్ సంస్థలు, కంపెనీ పోర్టల్ ద్వారా మాత్రమే విక్రయిస్తున్నట్లు తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy**. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.